సాక్షి నంద్యాల

శుక్రవారం । 2 । మే । 2025



ఉద్యోగి.. హతవిధీ!

గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులను సర్దుబాటు చేసే ప్రక్రియ పూర్తి అయ్యింది. త్వరలో పని భారం కూడా పెరగనుంది. ప్రభుత్వ నుంచి మార్గదర్శకాలు రానున్నాయి. 8లో▸



హే.. భగవాన్!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. 8లో▸



ఈత కొలనులో విషాదం

తల్లిదండ్రులకు చెప్పకుండా ఈత కొలనులో దిగిన ఐదేళ్ల బాలుడు నీట మునిగి మృతి చెందాడు. ఇస్వీ గ్రామ సమీపంలో విషాదం చోటుచేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

జ్వాలాపురం సందర్శన



ఆదిమానవులు సంచరించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్: ఆదిమానవులు నివసించిన ఆనవాళ్లు ఉన్న జ్వాలాపురం గ్రామాన్ని గురువారం అధికారులు సందర్శించారు. ఆదిమానవుల సంచారానికి సంబంధించిన కథనాలు ఇటీవల పత్రికల్లో ప్రచురితమవుతుండటంతో జిల్లా కలెక్టర్ రాజకుమారి స్పందించారు. ఈ మేరకు ఈ ప్రదేశాన్ని పరిశీలించేందుకు ఆర్డీఓ, డిప్యూటీ సీఈఓ, పురావస్తు, మైనింగ్‌శాఖ అధికారులు, తహసీల్దార్ మొత్తం ఏడుగురు అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రదేశాన్ని గురువారం డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శివారెడ్డి పరిశీలించారు. త్వరలో పురావస్తుశాఖ, ఆర్డీఓతో పాటు ఇతర అధికారులు జ్వాలాపురాన్ని పరిశీలించనున్నట్లు వారు తెలిపారు. వారి వెంట ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

శ్రీమఠంలో భక్తజన సందోహం



శ్రీమఠంలో బారులు తీరిన భక్తజనం

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం భక్తజన సందోహంతో కనువిందు చేసింది. గురువారం ప్రత్యేకం కావడంతో భక్తులు కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. రాఘవేంద్రస్వామి బృందావన దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. సాధారణ క్యూలైన్లు, వీవీఐపీ క్యూలైన్లు, మంచాలమ్మ దర్శన మార్గాలు భక్తులతో కిక్కిరిశాయి. అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లలో రద్దీ నెలకొంది. మధ్వమార్గం కారిడార్, తుంగభద్ర నది వైపు కారిడార్‌లు భక్తులతో పోటెత్తాయి.

కార్మిక చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు కల్చరల్: మేడే సందర్భంగా కర్నూలులోని న్యాయ సేవా సదన్‌లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మిక చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ అవగాహన కల్పించారు. ఈ–శ్రమ్ కార్డును పొందాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివరావు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు శ్రీలక్ష్మీ, కేశన్న, ప్రసాద్, దుకాణ కార్మికులు, ఆటో, హమాలీ, బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో వైద్యసేవలపై అభిప్రాయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అందే వైద్యసేవలపై క్యూఆర్ కోడ్‌తో రోగులు, వారి కుటుంబసభ్యులు అభిప్రాయాన్ని చెప్పవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ కౌంటర్, ఎంసీహెచ్, పీడియాట్రిక్, ఫిజియోథెరపి, శుశ్రుత భవన్ తదితర విభాగాల్లో పర్యటించి వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని పలు ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చే రోగులకు అందుతున్న వైద్యసేవల అభిప్రాయాన్ని క్యూఆర్ కోడ్‌లో నమోదు చేసుకునే విధంగా రోగులకు అవగాహన ఇవ్వాలని వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి సూచించారు. శుశ్రుత భవన్, సర్జికల్ విభాగంలోని ఆపరేషన్ థియేటర్‌లో పర్యటించి యూనిట్ వారీగా ఎన్నెన్ని సర్జరీలు చేస్తున్నారనే దానిపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి తప్పనిసరిగా ఆధార్‌కార్డు, అభా కార్డు తీసుకుని వస్తే ఓపీ నమోదు ప్రక్రియ, ఇతర సేవలు వేగంగా అందుతాయని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



వైద్యసేవల వివరాలు తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

అగమ్యగోచరం



నంద్యాల బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఓ వైపు వేసవి సెలవులతో విహార యాత్ర, దైవ దర్శనాలకు బయలు దేరిన కొందరు, మరో వైపు పెళ్లిళ్లు, శుభాకార్యాలతో కుటుంబాలతో ప్రయాణమైన మరి కొందరు.. వివిధ పనుల మీద దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇంకొందరు.. ఇలా ఎంతో మంది బస్టాండ్లకు చేరుకుంటే బస్సుల్లేవ్. ఆరా తీస్తే బస్సులు అమరావతిలో జరిగే మోదీ సభకు తరలించారని తెలుసుకుని అటు పాలకులు, ఇటు అధికారులపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా బస్సు సరీ్వసులు రద్దు చేస్తే ఊర్లకు చేరుకునేదెలా.. అంటూ మండిపడ్డారు. ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరవుతూ గంటల తరబడి బస్టాండ్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైంది.

- ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 220 బస్సులు మోదీ సభకు తరలింపు
- పలు రహదారుల్లో బస్సు సర్వీసులు రద్దు
- అవస్థలు పడిన ప్రయాణికులు
- గంటల తరబడి బస్టాండ్లలో నిరీక్షణ
- ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు చేరిన వైనం
- కూటమి ప్రభుత్వంపై ప్రయాణికుల ఆగ్రహం

నంద్యాల(వ్యవసాయం): రాజధాని పనుల పునఃప్రారంభానికి శుక్రవారం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమరావతికి వస్తుండడంతో కూటమి ప్రభుత్వం భారీగా జనసమీకరణకు సిద్ధమైంది. జిల్లాతో పాటు, ఇతర జిల్లాలకు చెందిన మహిళలు, కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులను ఆర్టీసీలో బస్సుల్లో తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆర్టీసీ డిపోల నుంచి దాదాపు 220 బస్సులను ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాలకు తరలించారు. దీంతో వివిధ పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. బస్టాండ్లలో బస్సులు లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. చిన్న పిల్లలతో వచ్చిన వారు, వైద్య చికిత్స నిమిత్తం వివిధ ఆసుపత్రులకు వచ్చి తిరుగు ప్రయాణమయిన వారు.. వృద్ధులు బస్టాండ్లలో ఉక్కపోతకు విలవిలలాడారు. కొంత మంది తప్పని పరిస్థితుల్లో అధిక చార్జీలు పెట్టి ప్రైవేటు వాహనాల్లో సొంతూర్లకు చేరుకున్నారు. పీఎం సభకు తరలించిన బస్సులు అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందినవి కావడంతో పేదలు, సామాన్యులు ఇబ్బందులు పడ్డారు. అరకొరగా ఉన్న బస్సుల్లో వెళ్లేందుకు పోటీ పడ్డారు. సీటు లేకపోయినా అతి కష్టం మీద నిల్చుని ప్రయాణించాల్సి వచ్చింది.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి..

బస్సు సర్వీసుల రద్దుతో బస్టాండ్లలో ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోని, డోన్ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ నిత్యం ఉంటుంది. ఈ క్రమంలో పలు రూట్లలో బస్సు సర్వీసులు లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అయితే ఎండ వేడమితో ఉక్కిరిబిక్కిరయ్యారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఉక్కపోతతో విలవిలాడారు. సౌకర్యాలు సైతం లేకపోవడంతో అవస్థలు పడ్డారు.

మరో రెండు రోజులూ.. ఇవే కష్టాలు

ఏపీ రాజధాని అమరావతి అంటూ.. 2015 జూన్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతల మీదుగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం తాత్కాలిక భవనాలతో సరిపెట్టింది. మరోసారి రాజధాని పనుల పునఃనిర్మాణం పేరుతో కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు పీఎం మోదీ శుక్రవారం అమరావతి రానున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను తరలించేందుకు కర్నూలు జిల్లా నుంచి 105, నంద్యాల జిల్లా నుంచి 115 బస్సులను వివిధ ప్రాంతాలకు మళ్లించారు. గత ఎన్నికల సమయంలో ఆర్టీసీ బస్సులను ప్రజల ప్రయాణానికి మాత్రమే వినియోగించాలి.. ప్రభుత్వ కార్యక్రమాలు, రాజకీయ పార్టీ సమావేశాలు కాదని ప్రగల్భాలు పలికారు. ఇప్పుడే అదే కూటమి నేతలు పీఎం సభకు ఆర్టీసీ బస్సులను మళ్లించడంపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు కొన్ని చోట్ల ప్రైవేటు స్కూళ్లకు చెందిన బస్సుల్లోనూ జనాలను తరలిస్తున్నారు. శుక్ర, శని వారాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. సుదూర ప్రాంతాలకు బస్సులను తరలించడంతో ఆ బస్సులు తిరిగి శనివారం ఆయా డిపోలకు చేరుకునే అవకాశం ఉంది. దీంతో ఉమ్మడి జిల్లాలో వివిధ రూట్లలో రద్దు చేసిన బస్సు సర్వీసులను శనివారం సాయంత్రం తర్వాతనే ఆర్టీసీ అధికారులు పునఃరుద్ధరించనున్నారు. అప్పటి వరకు ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలతో ప్రయాణించాల్సి పరిస్థితి నెలకొంది.



బస్సులు లేక బోసిపోయిన కర్నూలు బస్టాండ్



జన సమీకరణకు ఆంధ్ర వైపు వెళ్తున్న బస్సులు

భోజన భారం పంచాయతీ కార్యదర్శులదే!

అమరావతిలో మోదీ సభకు తరలించే జనాలకు భోజన ఖర్చుల భారం పంచాయతీ కార్యదర్శులు భరించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. జన సమీకరణలో భాగంగా జిల్లాలోని కొన్ని గ్రామాలకు బస్సులను కేటాయించారు. ఆ బస్సుల్లో వెళ్లే జనాలకు భోజనం, మంచినీటి సౌకర్యాలు అన్నీ ఆ గ్రామ పంచాయతీ సెక్రటరీ చూసుకోవాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఒక్కో బస్సులో 30 నుంచి 40 మంది వరకు వెళ్లే అవకాశం ఉంది. వారి ఖర్చులకు రూ. 25 వేల వరకు కానుంది. ఈ భారమంతా పంచాయతీ సెక్రటరీలపై పడటంతో ఉద్యోగులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.



ప్రయాణికులతో కిక్కిరిసిన కర్నూలు బస్టాండ్



డోన్ వెళ్తున్న బస్సు ఎక్కేందుకు పోటీ పడుతూ..

జిల్లాల వారీగా తరలించిన బస్సుల సంఖ్య	
కర్నూలు	నంద్యాల
105	115

“ రెండు గంటలైనా ఒక్క బస్సు రాలేదు

మా బంధువు కర్నూలు పెద్దాసుపత్రిలో ఉంటే పరామర్శించేందుకు వచ్చాం. తిరిగి ఆదోని వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చి రెండు గంటలైనా ఒక్క బస్సు కూడా లేదు. ఊరికెట్లా పోవాలో తెలియడం లేదు. ఎంతో మంది బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు బస్సులన్నీ వేరే ఊళ్లకు పంపితే మాలాంటోళ్ల పరిస్థితి ఎట్లా. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు హామీని వెంటనే నెరవేర్చాలి.

– వెంకటలక్ష్మి, ఆదోని

బస్సు లేక ఇబ్బంది పడ్డాం

పెళ్లి నిమిత్తం కుటుంబం అంతా కలిసి నంద్యాలకు వచ్చాం. కార్యక్రమం ముగించుకున్న తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాం. అప్పటి నుంచి 3 గంటలుగా బస్సు కోసం వేచి చూస్తూనే ఉన్నాం. ఎంక్వైరీలో అడిగితే ఎక్స్‌ప్రెస్ బస్సులు అమరావతికి తరలించడంతో బస్సులు తక్కువగా ఉన్నాయని, బస్సు వచ్చేంత వరకు వేచి ఉండాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

– మహేశ్వరరెడ్డి, కడప

ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం సరికాదు



రాజధాని పేరుతో ఆర్టీసీ బస్సులన్నీ గుంటూరు, విజయవాడ జిల్లాకు తరలించి ఇక్కడి ప్రయాణికులకు ఇబ్బంది పెట్టడం కూటమి ప్రభుత్వానికి తగదు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులదే. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి బస్సులను ఇతర ప్రాంతాలకు పంపితే పేదలు ఎలా ప్రయాణం చేయాలి.

– ఎం.శంకర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి, నంద్యాల

నరసింహ జయంతి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



వేద పండితుల ఆధ్వర్యంలో విష్వక్సేనుడిని మండపానికి తోడ్కొని వస్తున్న వేద పండితులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి అంకుర్పారణ పూజలు చేశారు. ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎగువ అహోబిలంలోని శ్రీ జ్వాలా నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనుడికి పూలమాలలు వేసి, తలపాగా చుట్టి పల్లకీలో కొలువుంచి ఆలయం వెలుపలకు తోడ్కొని వచ్చారు. ఈ బ్రహ్మోత్సవాలకు పర్యవేక్షకుడిగా విష్వక్సేనుడు వ్యవహరిస్తారని విశ్వాసం. అనంతరం ఆలయానికి ఈశాన్యం వైపు ఉన్న పుట్ట నుంచి సేకరించిన మట్టితో అంకుర హోమం నిర్వహించి సోముడిని (చంద్రుడిని) మట్టిలోకి ఆవాహం చేశారు. పాత్రలో మట్టిలో నవగ్రహాలకు సూచికగా నవధాన్యాలు పోసి సోమకుంభ స్థాపన చేశారు.

వీహెచ్‌ఏల రేషనలైజేషన్‌కు శ్రీకారం

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖలో గ్రామ ఉద్యాన సహాయకుల రేషనలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఉద్యాన శాఖ కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు పి.రామాంజనేయులు, నాగరాజు, కర్నూలు, నంద్యాల జిల్లాల హార్టికల్చర్ ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో 215 మంది గ్రామ ఉద్యాన సహాయకులు ఉన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన పంటలు ఉన్నప్పటికీ వీహెచ్‌ఏలు లేకపోవడం వల్ల రైతులకు సేవలు అందడం లేదు. ఉద్యాన పంటలు ఉన్న అన్ని ప్రాంతాల్లో వీహెచ్‌ఏలు అందుబాటులో ఉండాలని కోణంలో కసరత్తు చేస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు తెలిపారు. ఒకటి, రెండు ఈ ప్రక్రియ కొలిక్కి వస్తుందన్నారు.



మేడే స్ఫూర్తి

నంద్యాల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జిల్లాలో గురువారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల కార్మికులు ర్యాలీలు చేసి మేడే స్ఫూర్తి చాటారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేశారు.

పదవీ కాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. కర్నూలు జిల్లాలోని కృష్ణగిరి పీఏసీఎస్‌కు సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు పీఏసీఎస్‌కు అసిస్టెంటు రిజిస్ట్రార్ టి.నాగరమణయ్య, నంద్యాల జిల్లాలోని హనుమంతుగుండం పీఏసీఎస్‌కు అసిస్టెంటు రిజిస్ట్రార్ జి.రాచయ్య అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నారు. వీరి పదవీ కాలం ఏప్రిల్ 30తో ముగిసిన నేపథ్యంలో ఆరు నెలల పాటు పొడిగిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అస్తవ్యస్తంగా పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పింఛన్‌ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. చాలా చోట్ల వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటల దాటినా ఉద్యోగులు ఇంటి వద్దకు రాకపోవడంతో మండటెండల్లో గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. కల్లూరులో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయలేదు. కోడుమూరు, సి.బెళగల్, కర్నూలు, ఆదోని, డోన్, బనగానపల్లి, అవుకు తదితర ప్రాంతాల్లో నామమాత్రంగా చేశారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,37,828 పింఛన్‌లు ఉండగా 2,20,796 (92.84 శాతం), నంద్యాల జిల్లాలో 2,14,058 పింఛన్‌లు ఉండగా 1,97,669 (92.34 శాతం) పంపిణీ చేశారు. పింఛన్‌ల పంపిణీలో కర్నూలు జిల్లాకు రాష్ట్రంలో 15, నంద్యాల జిల్లాకు 22వ స్థానం లభించింది. నంద్యాల పట్టణంలో డీఆర్‌డీఓ పీడీ శ్రీధర్‌రెడ్డి పలు కాలనీలో పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. మిగిలిన వారికి కూడా శుక్రవారం పంపిణీ చేస్తామన్నారు.



పాణ్యం సమీపంలో ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు



రుద్రవరం మండలం కోటకొండ వద్ద ధాన్యంపై పట్టా కప్పుతున్న రైతులు

ఎంత కష్టం.. ఎంత నష్టం



అవుకు మండలం సంగపట్నంలో విరిగిపడ్డ బొప్పాయి చెట్లు

రైతు కష్టం నేలపాలవుతోంది. అకాల వర్షాలు అన్నదాతను నట్టేట ముంచుతున్నాయి. జిల్లాలో వరుసగా కురుస్తున్న అకాల వర్షాలతో రుద్రవరం, అవుకు, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల్లో వరి, మిరప, మామిడి, బొప్పాయి, అరటి రైతులు నష్టపోతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన చేరిన వరి, మిరప దిగుబడులు వానకు తడవకుండా కాపాడుకునేందుకు కష్టాలు పడుతున్నారు. ఈదురు గాలులకు అవుకు మండలం సంగపట్నంలోని షంషీర్ వలికి చెందిన 1,350 చెట్లు నేలవాలడంతో భారీ నష్టం వాటిల్లింది. కొలిమిగుండ్ల మండలంలో దాదాపు 50 హెక్టార్లలో అరటి చెట్లు నేలకొరిగాయి. రుద్రవరం మండలం కొండమాయపల్లె, వెలగలపల్లె, చిన్నకంబలూరు, బి.నాగిరెడ్డిపల్లె తదితర గ్రామాల పరిధిలో బుధవారం అర్ధరాత్రి భారీ గాలి వానకు వరి రైతులు కుదేలయ్యారు.

– అవుకు/రుద్రవరం

క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

ఆలూరు రూరల్: పరీక్షల్లో ఫెయిల్ అయ్యాయని మనస్తాపానికి చెందిన పదో తరగతి విద్యార్థి సిద్ధార్థ్ (15) ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాలు.. ఆలూరులోని కొట్టాల వీధికి చెందిన శ్రీనివాసులు, దానమ్మ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. మూడో సంతానమైన సిద్ధార్థ్ (15) స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1 పదో తరగతి చదివారు. గత ఏప్రిల్ 23న వెలువడిన ఫలితాల్లో సిద్ధార్థ్ ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు గమనించి ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సిద్ధార్థ్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ గురువారం కోలుకోలేక మృతి చెందాడు. సిద్ధార్ మృతికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

బాలికపై పందుల దాడి

కల్లూరు: ఆటలు ఆడుకుంటున్న బాలికపై పందులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం కల్లూరు అర్బన్ 32వ వార్డు పరిధిలోని పోలీస్ కాలనీలో చోటుచేసుకుంది. గురువారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. చుట్టుపక్కలవారు గమనించి పందులను తోలడంతో చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. తల్లిదండ్రులు చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. కాలనీలో పందుల బెడద ఎక్కువగా ఉందని, అధికారుల స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను పారబోస్తున్న దృశ్యం

ఆత్మకూరు: సిద్ధాపురం గ్రామానికి రెండు కి.మీ. దూరంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ గురువారం తెలిపారు. పీటల రాంప్రసాద్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు. నాటుసారా తయారు చేసే వారి వివరాలను 9440902585, 9177299067, 8328307774కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.



కోడుమూరు మండలం పులకుర్తి గ్రామ సచివాలయం

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు పారదర్శకంగా పనిచేసేవారు. ప్రజలకు నిజాయితీగా సేవలు అందించేవారు. ఎవరి సిఫార్సులు లేకుండా, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అమలు చేసేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను ఉక్కిబిక్కిరి చేసేలా చర్యలు తీసుకుంటోంది. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందకుండా ఉద్యోగులపై పనిభారం పెంచుతుందనే విమర్శలు వస్తున్నాయి. అలాగే గ్రామ, వార్డు సచివాలయాలను తగ్గించడంపై పలు ఆరోపణలు ఉన్నాయి.

ఉద్యోగి.. హతవిధీ!

- మారిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పనితీరు
- టెక్నికల్, జనరల్ ఫంక్షనీర్స్‌గా ఉద్యోగుల విభజన
- పలువురికి తప్పని స్థాన చలనం
- రెండు, మూడు సచివాలయాలకు ఒకరు పనిచేసేలా చర్యలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లాలో 672 సచివాలయాలు
- నేడు 350కి కుదించిన రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు(అర్బన్): వలంటీరు వ్యవస్థకు స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం నేడు సచివాలయ వ్యవస్థపై తన మార్క్ చూపించుకునేందుకు చర్యలు చేపట్టింది. ఏ గ్రామంలోని ప్రజలకు అక్కడే సేవలు అందిస్తున్న సచివాలయ వ్యవస్థలో క్లస్టర్ విధానం పేరుతో ఉద్యోగులకు పనిభారాన్ని పెంచనుంది. సచివాలయాల గ్రూపింగ్ పేరుతో సమీపంలో ఉన్న రెండు, మూడు సచివాలయాలను ఒకే క్లస్టర్ కిందకు తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఆయా గ్రామ/ వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులను సర్దుబాటు చేసే ప్రక్రియ దాదాపు పూర్తి అయ్యింది. ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్లస్టర్ విధానం అమల్లోకి రానుంది.

ఇవీ చర్యలు..

- వైఎస్సార్‌సీపీ హయాంలో కర్నూలు జిల్లాలో మొత్తం 672 సచివాలయాలు ఏర్పాటయ్యాయి.
- మొత్తం గ్రామ సచివాలయాలు 465, వార్డు సచివాలయాలు 207 ఉండేవి.
- ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సమీపంలోని ఒకటి, రెండు సచివాలయాల్లోని ఉద్యోగులకు సర్దుబాటు చేస్తోంది. మ్యాపింగ్‌లో భాగంగా 350 సచివాలయాలను నిర్ధారించారు.
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇక నుంచి టెక్నికల్ ఫంక్షనీర్స్‌గా గుర్తించిన ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు.
- జనరల్ ఫంక్షనీర్స్ (పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వార్డు అమెనిటీస్ సెక్రటరీ) అన్ని గ్రామ/ వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహించనున్నారు.

ఉద్యోగులపై అధిక ఒత్తిడి

ఇప్పటికే గ్రామ/వార్డు సచివాలయాల మ్యాపింగ్ పూర్తి అయ్యింది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే ఒక సచివాలయంలో ప్రస్తుతం పనిచేస్తున్న టెక్నికల్ ఫంక్షనీర్స్ ఇక నుంచి సమీపంలోని రెండు, మూడు సచివాలయాల్లో కూడా సేవలు అందించాల్సి ఉంటుంది. ఒక వేళ ఆయా విభాగాల్లో టెక్నికల్ ఫంక్షనీర్స్ సంఖ్య అధికంగా ఉంటే ఎక్కడైనా సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లోనైనా వారిని నియమించవచ్చు. లేదంటే మాతృ సంస్థల్లోనైనా వారి సేవలను ఉపయోగించుకునే అవకాశాలను ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విధానం అమలైతే టెక్నికల్ ఫంక్షనీర్స్‌గా గుర్తించిన సచివాలయ ఉద్యోగులపై అదనపు భారం పడనుంది. ఇప్పటికే తమ శాఖలకు సంబంధించిన విధులను నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు అదనంగా బీఎల్‌ఓ, సర్వేలు, పన్నుల వసూలు, పెన్షన్ల పంపిణీ తదితర పనులు చేస్తున్నారు. ప్రస్తుతం తమ సచివాలయానికే పరిమితమైన ఈ పనులు క్లస్టర్ అమల్లో భాగంగా మ్యాపింగ్ అయిన సచివాలయాల్లో కూడా చేయాల్సి ఉంటుంది. దీంతో ఉద్యోగులు అధిక ఒత్తిడికి గురి అయ్యే ప్రమాదం ఉంది.

ఉద్యోగుల విభజన ఇలా..

ఇప్పటికే గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను టెక్నికల్, జనరల్ ఫంక్షనీర్స్ అంటు రెండు విభాగాలుగా విభజించారు. ప్రస్తుతం ప్రతి సచివాలయంలో అన్ని విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన క్లస్టర్ ప్రక్రియకు మార్గదర్శకాలు విడుదలైన వెంటనే ముందుగా టెక్నికల్ ఫంక్షనీర్స్‌గా గుర్తించిన ఉద్యోగులు ఒక్కొక్కరు రెండు లేక మూడు సచివాలయాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆయా కేటగిరీలకు చెందిన మిగిలిన ఉద్యోగులను ఖాళీగా ఉన్న ప్రాంతాలకు లేదా ఇతర శాఖలకు బదిలీ చేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో జనాభాకు అనుగుణంగా సచివాలయాలు...

గ్రామీణ ప్రాంతాల్లో		పట్టణ ప్రాంతాల్లో
ఏర్పాటైన సచివాలయాలు	జనాభా	ఏర్పాటైన సచివాలయాలు
71	2500 కంటే తక్కువ జనాభా ఉంటే	24
150	2501 నుంచి 3500 జనాభా ఉంటే	60
244	3500 కంటే ఎక్కువ జనాభా ఉంటే	123
465	మొత్తం:	207

టెక్నికల్ ఫంక్షనీర్స్ ఎంత మంది ఉన్నారంటే...

వీఆర్ఓ	106
సర్వే అసిస్టెంట్	411
అగ్రికల్చర్ అసిస్టెంట్	230
హార్టికల్చర్ అసిస్టెంట్	114
ఫిషరీస్ అసిస్టెంట్	08
ఏఎన్ఎం	280
ఇంజినీరింగ్ అసిస్టెంట్	359
అనిమల్ హజ్‌బెండరీ అసిస్టెంట్	159
సెరికల్చర్ అసిస్టెంట్	178
మహిళా పోలీస్	373

గతంలో ఇలా..

- గ్రామ/వార్డు సచివాలయాలు ఆవిర్భావానికి ముందు మూడు, నాలుగు గ్రామాలకు ఒక్క పంచాయతీ కార్యదర్శి మాత్రమే ఉండేవారు.
- వ్యవసాయ అసిస్టెంట్లు ఎక్కడో ఉండేవారో తెలియని పరిస్థితి.
- అవసరాలకు అనుగుణంగా సర్వేయర్లు ఉండే వారు కాదు.
- పలు మండలాల్లో ఇన్‌చార్జ్ సర్వేయర్లతో ప్రజలు ఇబ్బంది పడేవారు.

మళ్లీ అవే కష్టాలు

- రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న సచివాలయాల క్లస్టర్ల విధానంతో పాత రోజులు పునరావృతం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
- గ్రూపింగ్‌లో భాగంగా తీసుకోబోయే నిర్ణయాలతో ఆయా సచివాలయాల్లోని కీలకమైన ఉద్యోగులు రెండు, మూడు గ్రామాలకు ఒకరు ప్రకారం పనిచేయాలి.
- గ్రామాల్లో సర్వేయర్ల సమస్య తీవ్రంగా వేధించే అవకాశం ఉంది.
- ప్రజలకు పారదర్శంగా సచివాలయ ఉద్యోగుల సేవలు అందే అవకాశం లేదు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి గ్రామ/ వార్డు సచివాలయాల మ్యాపింగ్‌ను దాదాపు పూర్తి చేశాం. సమీపంలోని సచివాలయాల మ్యాపింగ్‌లో భాగంగా 350 సచివాలయాలను గుర్తించాం. ప్రధానంగా టెక్నికల్ ఫంక్షనీర్స్‌గా గుర్తించిన ఉద్యోగులు ఇక నుంచి సమీపంలోని రెండు సచివాలయాల్లో సేవలను అందించాల్సి ఉంటుంది. ఉద్యోగుల సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైతే స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది.

– జీ నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ అధికారి

కొత్త పోస్టుల భర్తీ లేనట్టే!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో జీరో వేకెన్సీకి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. ఆయా శాఖల్లో ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీకి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. గ్రామ/ వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 1,969 పోస్టుల భర్తీకి మూడో విడత నోటిఫికేషన్ జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియకు అప్పట్లో బ్రేకులు పడ్డాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న హేతుబద్ధీకరణ పూర్తయితే కొత్త పోస్టుల భర్తీ లేనట్టే అని స్పష్టమవుతోంది.

రూ.40.13 కోట్ల రోడ్ల పనులకు పాలనా అనుమతులు

- పీఆర్ ఎస్ఈ వీ రామచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాబార్డు నిధులతో చేపట్టనున్న రోడ్ల పనులకు పాలనా అనుమతులు మంజూరు చేస్తు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు వీ రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలకు పూర్తి ఇబ్బందిగా ఉన్న రోడ్లను ఎంపిక చేసి ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే కర్నూలు జిల్లాలో 14 రోడ్ల పనులకు రూ.19.74 కోట్లు, నంద్యాల జిల్లాలో 14 రోడ్ల పనులకు రూ.20.39 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేశారన్నారు. ఈ పనులు పూర్తి అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 100 కిలో మీటర్ల మేర కొత్త రోడ్లు ఏర్పాటవుతాయన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయా రోడ్ల పనులను చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

హత్య కేసు నిందితులకు యావజ్జీవ జైలు శిక్ష



పోలీసుల అదుపులో శిక్ష పడిన ముద్దాయిలు

డోన్ టౌన్: ఓ వ్యక్తి హత్య కేసులో సాక్ష్యాలు రుజువు కావడంతో నిందితులకు యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి కబర్ది తీర్పు వెలువరించారు. డోన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్రాయి పంచాయతీ పరిధిలోని మజరా గ్రామమైన ఎస్. గుండాలకు చెందిన బోయ గుడిమిరాళ్ల కొలుట్ల (60) డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో 2016 మే 15వ తేదీన దారుణహత్యకు గురయ్యాడు. పాత కక్షల నేపథ్యంలో కొత్రాయి గ్రామానికి చెందిన మాదిగ నగేష్, అతని బంధువు గుమ్మకొండ గ్రామానికి చెందిన హరిజన నాయకంటి బాలమద్ది అలియాస్ కంకర బాలమద్ది రాయితో తలపై మోది హత్యకు పాల్పడినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో ఇద్దరు నిందితులు హత్యకు పాల్పడినట్లు రుజువు కావడంతో గురువారం జిల్లా న్యాయమూర్తి కబర్ది యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

చిప్పగిరిలో భయం.. భయం!

- కొనసాగుతున్న పోలీసు పికెట్



చిప్పగిరిలో పోలీసు పికెట్

ఆలూరు: ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ నేత లక్ష్మీనారాయణ(60)ను గత నెల 27న హత్య చేయడంతో చిప్పగిరి గ్రామంలో భయం నెలకొంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. టీడీపీ నాయకులే హత్య చేసి ఉండవచ్చనే అనుమానాలు వస్తున్నాయి. చిప్పగిరిలో ప్రజలకు రక్షణ కల్పిస్తూ పోలీసులు పికెట్ కొనసాగిస్తున్నారు. గుంతకల్లు నుంచి చిప్పగిరికి గత నెల 27న లక్ష్మీనారాయణ ఇన్నోవా వాహనంలో బయలుదేరగా గుంతకల్లు రైల్వేబ్రిడ్జి వద్ద టిప్పర్‌తో ఢీకొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. హత్య కేసును పూర్తిస్థాయిలో విచారించేందుకు ఏఎస్పీ హుసేన్‌పీరా నియమించగా.. ఐదు పోలీసుల బృందాలుగా ఏర్పడి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో విచారణ సాగిస్తున్నారు. గ్రామంలో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య నేతృత్వంలో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 10 నుంచి 15 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి మే 4వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండ్లు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, పోలీస్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్ చెప్పిన విషయాలు ఇవీ..

- జిల్లాలో 16 పరీక్ష కేంద్రాల ఏర్పాటయ్యాయి. అన్నీ కర్నూలు నగరంలోనే ఉంటాయి.
- పరీక్షకు మొత్తం 4,466 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష ఉంటుంది.
- మే 4న ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు.మధ్యాహ్నం 1.30 గంట తరువాత అనుమతించరు.
- ప్రతి నాలుగు కేంద్రాలకు ఒక జిల్లా అధికారి నియామించాం.
- దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లను ఏర్పాటు చేయాలి.
- కర్నూలు నగరంలో ట్రాఫిక్ అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలి.
- ట్రిపుల్‌ఐటీ డీఎం కేంద్రానికి వెళ్లేందుకు బస్సులు అందుబాటులో ఉంచాలి.
- పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాప్‌లను మూసివేయాలి. విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలి.
- సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదు.
- సమావేశంలో అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, డీఎస్పీ బాబు ప్రసాద్, డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్, నోడల్ ఆఫీసర్ పాయల్ ప్రియదర్శిని, డీఈవో శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సార్.. మంచినీటిని సరఫరా చేయండి

- ఆరేళ్ల బాలుడి అభ్యర్థన సోషల్ మీడియాలో వైరల్



ఈఓకు రాసిన లేఖను చూపిస్తున్న ఆరేళ్ల బాలుడు

కోవెలకుంట్ల: పట్టణంలోని వివిధ కాలనీల్లో కుళాయిల ద్వారా ఉప్పునీరు సరఫరా అవుతోందని ఆరేళ్ల బాలుడు గురువారం లేఖ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. స్థానిక సాయినగర్ కాలనీకి చెందిన షాజిల్ హుస్సేన్ అనే బాలుడు 'మాకు ఉప్పునీరు వద్దు.. కుందూనది నీరు సరఫరా చేయండి' అనే సందేశాన్ని లేఖ ద్వారా ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్ నాయుడుకు తెలియజేశాడు. బాలుడు రాసిన లేఖ కోవెలకుంట్ల పట్టణంలోని స్థానిక వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈత కొలనులో విషాదం


- నీట మునిగి ఐదేళ్ల బాలుడు మృతి



బాలుడు ప్రిన్స్ (ఫైల్)

ఆదోని అర్బన్: ఈత కొలనులో నీట మునిగి ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన ఇస్వీ గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఇస్వీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన రవి, రీటా దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. గురువారం ఉదయం ఇస్వీ గ్రామ సమీపంలో ఉన్న ఈత కొలనుకు ముగ్గురు కుమారులతో కలిసి తల్లిదండ్రులు వెళ్లారు. తల్లి రీటా తన రెండో కుమారుడు దుస్తులు మారుస్తుండగా తండ్రి బెలూన్ తేవడానికి వెళ్లాడు. తల్లిదండ్రులకు చెప్పకుండా పెద్ద కుమారుడు ప్రిన్స్ (5) ఈతకొలనుతో దూకాడు. కాళ్లు, చేతులు ఆడించినా నీటిలో మునిగిపోయాడు. పది నిమిషాల తర్వాత తల్లిదండ్రులు ప్రిన్స్ ఎక్కడికి వెళ్లిపోయాడని వెతుకుతుండడంతో ఈత కొట్టే వ్యక్తి విషయాన్ని తెలిపారు. ఈత కొలను నుంచి ప్రిన్స్‌ను బయటకు తీసి వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు అప్పటికే ప్రిన్స్ మృతి చెందాడని తెలిపారు.

కోలుకోలేక ఏఆర్ కానిస్టేబుల్ మృతి



చిన్నికృష్ణ (ఫైల్)

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చిన్నికృష్ణ (35) గడ్డిమందు తాగి గత ఏప్రిల్ 25 నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే కోలుకోలేక గురువారం మరణించారు. ఉద్యోగ రీత్య స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో నివాసముంటున్న చిన్నికృష్ణ ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెందాడు. ఈనేపథ్యంలో నంద్యాల శివారులో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అయితే కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం.

ఆర్‌యూలో ఘర్షణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. గురువారం వర్సిటీలోని పోర్త్ బిల్డింగ్ సమీపంలో ఓ విద్యార్థి సంఘం నాయకుడు, బోధనేత ర ఉద్యోగి ఒకరికొకరు వాగ్వాదం చేసుకున్నా రు.ఘర్షణ తీవ్రం కావడంతో పరస్పరం దూషి ంచుకుంటూ దాడి చేసుకున్నారు. తర్వాత ఇరువురు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడుకు ఫిర్యాదు చేశారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- అమ్మాయి విషయంలో గొడవ పడే హత్య
- వివరాలు వెల్లడించిన కర్నూలు టౌన్ డీఎస్పీ



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు (టౌన్): హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నూలులోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం సాయంత్రం డీఎస్పీ బాబు ప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. కోడుమూరు మండలం పులకుర్తికి గ్రామంలో మునిస్వామి, మరో వర్గానికి చెందిన నడిపి రంగడు, సురేష్‌కు మధ్య కొన్నేళ్లుగా ఒక అమ్మాయి విషయంలో గొడవలు ఉన్నాయి. గత నెల 26న మునిస్వామి, అతని స్నేహితుడు మహేష్ మద్యం సేవించి ట్రాక్టర్ డ్రైవర్ సోమేష్ వద్దకు వెళ్లి సురేష్ గురించి ఆరా తీశారు. సురేష్‌కు ఈ విషయాన్ని డ్రైవర్ సోమేష్ చెప్పారు. పులకుర్తి గ్రామంలోని గూడూరు బస్టాప్ వద్ద ఉన్న సురేష్, నడిపి రంగడులపై నాటు కట్టెలు, రాడ్లతో మునిస్వామి వర్గీయులు దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయ పడిన నడిపి రంగడు ఈనెల 28న కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిందితులను గురువారం మధ్యాహ్న సమయంలో అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

- అరెస్టు అయిన వారిలో మునిస్వామి, శివరాముడు, పెద్ద బజారి, రాకేష్, సురేష్, నాగరాజు, బంగి తిమ్మప్ప (పులకుర్తి గ్రామం) కల్లపరి నాయుడు ఉన్నారు. హత్య ఘటనలో పాల్గొన్న మొత్తం 8 మంది నిందితులను కోడుమూరు సీఐ చిరంజీవి, ఎస్ఐ స్వామి, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య, పోలీస్ సిబ్బంది అరెస్టు చేశారు. నిందితుల నుంచి నాటు కట్టెలు, రాడ్లు, మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

రేపు ఎంపీహెచ్‌ఏలకు రీ డిప్లాయ్‌మెంట్ కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్)లకు ఈ నెల 3వ తేదీన రీ డిప్లాయ్‌మెంట్ (పునఃవిస్తరణ) కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ ఎంపీహెచ్ఏ (మేల్)ల 45 మందితో కూడిన సీనియారిటీ జాబితా రూపొందించి విడుదల చేశారు. వీరిని మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో పనిచేయించేందుకు సర్దుబాటు చేయనున్నారు.

పట్టపగలే చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని నెహ్రూనగర్‌లో పట్టపగలే చోరీ జరిగింది. వివరాలు.. నాగరాజు అతని భార్య హాస్పిటల్ కోసం బుధవారం ఇంటికి తాళం వేసి కర్నూలుకు వెళ్లారు. ఇదే అదునుగా దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉంచిన బంగారంతో పాటు నగదు దోచుకెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చిన నాగరాజు చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. సుమారు 10 తులాల బంగారం, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు సమాచారం.



మండుటెండలకు కోవెలకుంట్ల పట్టణంలో నిర్మానుష్యంగా ప్రధాన రోడ్డు

హే.. 'భగ'వాన్!



చెరుకు రసం తాగుతున్న జనం

వేసవికాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 9 గంటలకే ఎండతీవ్రత ఉంటోంది. ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలు విపరీతమైన ఎండలతో అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. మండుటెండల నుంచి రక్షణ పొందేందుకు నెత్తిన టవళ్లు, చీర కొంగులు, గొడుగులు, టోపీలు పెట్టుకుని నడక సాగిస్తున్నారు. మరోవైపు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, చెరుకు రసం తదితర శీతలపానీయాలు తాగి దాహార్తి తీర్చుకుంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండుటెండలతో బెంబేలెత్తిపోతున్నారు. – కోవెలకుంట్ల